ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉచిత ఇసుకపై రగడ

- నిల్వలపై అయ్యన్న, ఉమాశంకర్ పరస్పర విమర్శలు
- గబ్బాడలో వాయిదా
- ఇరకాటంలో అధికారులు
- నక్కపల్లిలో ఆలస్యంగా ప్రారంభం

గబ్బాడలోని ఇసుక డిపో

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి, నర్సీపట్నం రూరల్ విలేకర్లు

జిల్లాలోని నర్సీపట్నం గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలపై టిడిపి, వైసిపి పరస్పర విమర్శలతో ఉచిత ఇసుక విధానం ప్రారంభానికి ఆటంకం ఏర్పడింది. జిల్లాలో నక్కపల్లి, గబ్బాడలో ఇసుక డిపోలున్నాయి. సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకొస్తామన్న ప్రభుత్వం మధ్యాహ్నం వరకు విధివిధానాలు విడుదల చేయలేదు. దీంతో అధికారులు ఉచిత ఇసుక ప్రారంభంపై మార్గదర్శకాలు వచ్చే వరకు వేచిచూశారు. ఉచిత ఇసుకపై ప్రభుత్వం జిఒ విడుదల చేశాక సాయంత్రం ఆరు గంటల తరువాత నక్కపల్లిలో ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు ప్రారంభించారు. గబ్బాడలో మాత్రం ఇరు పార్టీల నాయకుల విమర్శలతో ప్రారంభించడానికి అధికారులు సాహసించ లేకపోయారు. ఇసుక డిపోలోని నిల్వలపై విచారణకు శాసనసభ స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడు ఆదేశించారు. బాధ్యులపై కేసు నమోదు చేసిన తరువాత మాత్రమే ఇసుక అమ్మకాలు ప్రారంభించాలని డిమాండ్ చేయడంతో అధికారులు ఇరకాటంలో పడ్డట్లయింది.

దీనికి ప్రతిగా ఇసుక నిల్వలను తక్కువచేసి చూపించి తరువాత అమ్ముకోవడానికి టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. ఇసుక డిపోలో దాదాపు 80 వేల టన్నుల ఇసుక వున్నప్పటికీ, 40 వేల టన్నులు వుందని చెప్పి, తరువాత ఆ ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుందామని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది జనవరి నుంచి డిపోకు వచ్చిన ఇసుకలో జరిగిన విక్రయాలు, నిల్వలపై సమాచారం రికార్డుల ప్రకారం వెల్లడించాలని గణేష్ డిమాండ్ చేస్తున్నారు. ఇసుక నిల్వలపై ఇరు పార్టీల నాయకుల విమర్శలతో గబ్బాడలో ఉచిత ఇసుక కార్యక్రమం సోమవారం వాయిదా పడింది. ఇదిలావుండగా నూతన ఇసుక విధానంపై ప్రభుత్వం ధర నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.1400కు విక్రయించగా, కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చి టన్ను ఇసుక ధరను రూ.1225గా నిర్ణయించింది. టన్ను ఇసుక ధర రూ.1225 అని ఇసుక డిపోల వద్ద అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఇసుక టన్ను ధర వ్యత్యాసం రూ.175 మాత్రమే ఉండడంతో వినియోగదారులు పెదవి విరుస్తున్నారు.

డల్లాస్‌లో సంఘీభావ సభలో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

విశాఖ ఉక్కు.. తెలుగు ప్రజల హక్కు

- నినదించిన ప్రవాసాంధ్ర
- డల్లాస్‌లో సంఘీభావ సభ

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు.. తెలుగు ప్రజల హక్కు అని అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో ప్రవాసాంధ్రులు నినదించారు. డల్లాస్ నగర పరిధిలోగల ప్రముఖ ప్రవాసాంధ్రులు, చిన్నారులు, తెలుగు సంఘాల ప్రతినిధులు, విశాఖ ఉక్కు పరిశ్రమకు సేవలందించిన పూర్వ కార్మికులు, నేటికీ దానిలో సేవలందిస్తున్న వారు, వామపక్ష ప్రగతిశీలవాదులు, ఔత్సాహికులు ఒక్కచోటకు చేరుకున్నారు. అక్కడ థామస్ జెఫర్సన్ పార్కుకు విచ్చేసి 'విశాఖ ఉక్కు.. తెలుగు వారి హక్కు' పేరిట సంఘీభావ సభ నిర్వహించారు. తొలుత పార్కులోని గాంధీ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళ్లర్పించారు. అనంతరం ఇర్వింగ్ నగర ప్రముఖులు ఖలీల్ అహ్మద్, పూర్వ పాత్రికేయులు దాసరి కృష్ణమోహన్ సభకు అధ్యక్షత వహించారు.

లెనిన్‌బాబు వేముల మాట్లాడుతూ కొన్ని సంస్థల ఆవశ్యకతను కేవలం లాభనష్టాల గణాంకాలతో తూకం వేయలేమని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై పునరాలోచించుకోవాలని కోరారు. అమెరికా జాతీయ స్థాయి తెలుగు సంఘం నాట్స్ సంస్థ నాయకులు నూతి బాపయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కుది గొప్ప చరిత్రని తెలిపారు. కార్యక్రమంలో మిగతా 2లో..

అర్జీదారుల సమస్యలను పరిష్కరించండి

▶ వార్త 2లో..

సత్యనారాయణపై ఏం చర్యలు తీసుకున్నారు...?

▶ వార్త 2లో..

రైల్వే జోన్ పనులు వెంటనే ప్రారంభించాలి : సిపిఎం

▶ వార్త మెయిన్‌లో..

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ న్యూ వెస్ట్ క్యాబిన్ బ్లాక్ హట్ - విజయవాడ స్టేషన్ మధ్య మూడో లైన్ కోసం ప్రీ -నాన్ ఇంటర్ లాకింగ్ / ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న కారణంగా 17488 విశాఖపట్నం - కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 5 నుంచి 10 వరకు, 17487 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 6 నుంచి 11 వరకు రద్దు చేశారు. అలాగే పలు రైళ్లను దారి మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

రథయాత్ర ప్రత్యేక రైళ్లు

పూరీ రథయాత్ర నేపథ్యంలో ప్రయాణికుల అవసరార్థం హరిపూర్‌గ్రామ్, అర్గుల్ మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 08333 నౌపడ-పూరీ-నౌపడ అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక ప్యాసింజర్ రైలు జులై 15, 16 తేదీలలో ఉదయం 4 గంటలకు నౌపడ నుంచి బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 12.05 గంటలకు పూరీ చేరుకుంటుంది.

08334 పూరీ-నౌపడ అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక ప్యాసింజర్ రైలు జులై 15, 17 తేదీలలో రాత్రి 23.00 గంటలకు పూరీ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకు నౌపడ చేరుకుంటుంది. ఈ రైళ్లు నౌపడ-పూరీ మధ్య అన్ని స్టేషన్లలో ఆగుతాయి.

కెజిహెచ్ ఆరోగ్యశ్రీ డిసిగా డాక్టర్ అప్పారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఆరోగ్యశ్రీ డిసిగా డాక్టర్ కె.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యశ్రీ డిసిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంద్ర ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

మూడు రోజులైనా..

దొరకని నిందితుని ఆచూకీ

- బాలిక హత్య కేసుపై పోలీసు దర్యాప్తు ముమ్మరం
- గాలింపు చర్యల్లో 20 బృందాలు
- నిందితున్ని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆందోళనలు

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామంలో మైనర్ బాలిక హత్యకు గురై మూడు రోజులైనా నిందితుని ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రేమోన్మాది సురేష్ కత్తితో అతి కిరాతకంగా తొమ్మిదో తరగతి చదువుతున్న బద్ధి దర్శినిని పొడిచి చంపాడు. అనంతరం అతడు సమీపంలోని కాంపౌండ్ వాల్ దాటి తూర్పు వైపుగా కొబ్బరి తోటలోంచి పారిపోయాడు. నేవీ గోడను అనుకొని ఉన్న కొత్తపేట - గోవిందపాలెం వైపుగా అతడు వెళ్లడం చూశామని కొందరు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితున్ని పట్టుకునేందుకు ముగ్గురు డిఎస్‌పిల పరిధిలో 20 టీములు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఇదిలా ఉండగా నిందితున్ని నేటికీ పట్టుకోకపోవడంపై గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. ఫోక్సో చట్టం కింద అరెస్టయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితునిపట్ల పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం వల్లనే మిగతా 2లో..

నిందితుడు సురేష్

గ్రామంలో విచారణ చేపడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యులు

మొదటి పేజీ తరువాయి..

దొరకని నిందితుని ఆచూకీ

ఈ ఘటన జరిగిందని ఐద్వా నేతలు చెబుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి మూడు పర్యాయాలు నిందితుని వల్ల దర్శిని ఇబ్బంది పడుతోందని చెప్పినప్పటికీ పోలీసులు సరైన చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు. బాలిక హత్య కేసులో నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన సోమవారం రాంబిల్లి, నర్సీపట్నం, యలమంచిలి ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు.

గ్రామాన్ని సందర్శించిన బాలల హక్కుల కమిషన్

కొప్పుగుండుపాలెంలోని బాధిత కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ సోమవారం పరామర్శించారు. దారుణ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. డ్రగ్స్, ఫోక్సో కేసుల్లో బెయిల్‌పై విడుదలైన వారిపై పోలీసులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో యువత పెడదోవ పట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు, ప్రభుత్వ విభాగాలు మరింత సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. ఫోక్సో, ఇతర బాలల చట్టాలపై ప్రాథమిక తరగతి నుంచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. దర్శిని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ఇందిరాదేవి, సిబ్బంది శశికళ, పర్యవేక్షక అధికారి రాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది లక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. తెలుగు ప్రజల హక్కు

రాజంపేట జనసేన నాయకులు మల్లిశెట్టి వెంకటరమణ, తెలంగాణ విద్యా వేదిక సభ్యులు, సాహితీవేత్త సాజీ గోపాల్, ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం అధ్యక్షులు సతీష్ బండారు, పోలవరపు శ్రీకాంత్, కోటపాటి, కామన శ్రీనివాస్ పాల్గొన్నారు. చిన్నారులు హంసి నంబూరు, చైత్ర నంబూరు గేయాలు, సమన్విత మాడ, సింధూర, సాహితి వేముల ఆలపించిన దేశభక్తియుత గీతాలు, చుండూరు మోన్విత నృత్యరూపకం అలరించాయి.

రైల్వే కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో రూ.300 కోట్లు గోల్‌మాల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైల్వే కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో రూ.300 కోట్లకుపైగా షేర్ హోల్డర్ల డిపాజిట్ సొమ్ము గోల్‌మాల్ జరిగిందని, షేర్ హోల్డర్లకు ఇవ్వాల్సిన రూ.100 కోట్లకు పైబడి డివిడెండ్‌లు చెల్లించలేదని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌సి.సాహూ ఆరోపించారు. దొండపర్తిలోని రైల్వే డిఆర్ఎం ఆఫీస్ వెనుకగల యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి రైల్వే అర్బన్ బ్యాంకు కార్యవర్గ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించవలసిన ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రస్తుత బ్యాంకు కార్యవర్గం దొంగ నాటకాలు ఆడుతోందన్నారు. రైల్వే అర్బన్ బ్యాంకు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ప్రస్తుత బ్యాంకు డైరెక్టర్లు వందల కోట్ల రూపాయల స్కాంకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అతీగతీ లేదన్నారు. శ్రామిక కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎమ్‌డి జియా, యూనియన్ నాయకులు తమ్మినేని నరసింగరావు, మౌలి, వెంకటరావు, కోటేశ్వరరావు, ఎంవి.పాపారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వంశీకృష్ణ శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరికీ తాను అందుబాటులో ఉంటానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నియోజవర్గం పరిధిలోని 29వ వార్డులో జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలోనూ, 35వ వార్డులో జనసేన సీనియర్ నాయకులు బొగ్గు శ్యామ్ దంపతుల ఆధ్వర్యంలోనూ జరిగిన కార్యక్రమాలలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. 35వ వార్డులోని దుర్గాలమ్మ అమ్మవారిని, ఎర్నిమాంబ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

విశాఖ పోర్టులో బంగ్లాదేశ్ బృందం పర్యటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : బంగ్లాదేశ్ షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్ఎం.మోస్తఫా కమాల్, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి షేక్ సాలె అహ్మద్‌ల ఆధ్వర్యంలో పది మందితో కూడిన బంగ్లాదేశ్ బృందం సోమవారం విశాఖ పోర్టును సందర్శించింది. వారికి విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సాదర స్వాగతం పలికారు. భారత్‌లో తూర్పు తీర పోర్టుల వాణిజ్య, సాంకేతిక కార్యకలాపాలను సమీక్షించడం ద్వారా రెండు దేశాల ప్రయోజనాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ బృందం పర్యటన సాగనుంది.

విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యమని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎంవిపి కాలనీలోని ఎస్‌వివిపి డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటి, విత్తన బంతులు తయారు చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్, వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ ప్రతినిధి హాని, యాక్షన్ ఎయిడ్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమేట్ టీం వాలంటీర్లు రవితేజ రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించండి

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరీంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడాలని, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సంబంధిత విభాగాల పరిధిలో నమోదైన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి, అందులో ఐదు విభిన్నమైన అంశాలపై ఐదుగురి అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. ఒక జిల్లా స్థాయి అధికారి అర్జీదారుతో మాట్లాడితే వారిలో తెలియని ధైర్యం కలుగుతుందని, నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యను బట్టి ఆయా శాఖలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, జివిఎంసి ఎడిసి ఎస్ఎస్.వర్మ, ఎసిపి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు. మొత్తంగా వారికి 268 వినతులు అందాయి.

ఎన్‌సిసి ప్రాజెక్టుకు అక్రమ అనుమతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత కూడా వైసిపి పెద్దలు విజయసాయి రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత కార్యదర్శి కెవిఎన్ఆర్‌ల ఒత్తిడికి లొంగి అవినీతి ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. సోమవారం మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధురవాడలోని అత్యంత వివాదాస్పద ప్రాజెక్టు అయిన ఎన్‌సిసి భూములను అధికార దుర్వినియోగంతో చేజిక్కించుకున్న విజయసాయి రెడ్డి బినామీ అయిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ సోదరుడు కొట్టు మురళికి, కెవిఎన్ఆర్ బినామీలకు నిబంధనలకు విరుద్ధంగా కమిషనర్ కట్టబెట్టారని ఆరోపించారు. విల్లాల నిర్మాణానికి తన చేతికి మట్టి అంటకుండా డీమ్ అప్రూవల్ వచ్చేట్టు వ్యవహరించారని తెలిపారు. సమావేశంలో టిడిపి కార్పొరేటర్లు నొల్లి నూకరత్నం, గొలగాని మంగవేణి, జోనల్ కో - ఆర్డినేటర్ భైరెడ్డి పోతన్న రెడ్డి పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు సమిష్టి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు అధికారులంతా సమష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంధ్ర ప్రసాద్ అన్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో చేపట్టనున్న వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను, కరపత్రాలను సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్టు నివారణ అధికారి పూర్ణేంద్ర పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు ఆరోపణల విషయంలో..

సత్యనారాయణపై ఏం చర్యలు తీసుకున్నారు...?

- ఎయుకు జాతీయ మహిళా కమిషన్ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందీ విభాగం ప్రొఫెసర్ ఆచార్య ఎన్.సత్యనారాయణ లైంగిక వేధింపులపై వచ్చిన ఆరోపణల విషయంలో ఆయనపై ఏం చర్యలు తీసుకున్నారో తమకు తెలియపరచాలని జాతీయ మహిళా కమిషన్ యూనివర్సిటీ అధికారులను కోరింది. ఈ మేరకు తాజాగా ఎయు అధికారులకు ఒక లేఖను పంపింది. ఈ నెల 19వ తేదీన స్వయంగా న్యూఢిల్లీలోని తమ కార్యాలయం ముందు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా కోరింది.

తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ పరిశోధకురాలు హిందీ విభాగ ప్రొఫెసర్ ఆచార్య నల్లా సత్యనారాయణపై జాతీయ మహిళా కమిషన్‌కు గతంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన రాష్ట్ర స్థాయిలో పతాక శీర్షికల్లో నిలిచింది.

CHANGE OF NAME

KHAJA BEGAM WIFE OF ARMY NO. 15577644-P, RANK - NK, SHAIK MADEENA UNIT - 120 ENGR REGT DECLARE THAT I HAVE CHANGED MY NAME FROM KHAJA BEGAM TO KHAJA BEGUM VIDE AFFIDAVIT NO IN-AP99764737019621W, DATE : 05-JULY-2024

గ్రామ పంచాయితీ కార్యాలయం, తాటితూరు

రేఖా నెం. 14/2024 | టెండరు ప్రకటన | తేదీ.06-07-2024

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తాటితూరు గ్రామపంచాయతీ నందు, దిగువ షెడ్యూలు నందుదహరించిన పనులను 2024-25 సం.నకు కాంట్రాక్టు పద్ధతిపై చేయుటకు పనివార్ని సప్లయి చేయుటకు తే: 16-07-2024దిన మధ్యాహ్నం గం. 12.00ల వరకు తాటితూరు గ్రామ సచివాలయం నందు ఈ దిగువ సంతకం దారునిచే గానీ, వారి అనుమతి పొందిన యితర ఉద్యోగిచే గానీ, సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం. 3.00 లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు టెండరు ధరావత్తు చెల్లించి, టెండరు షరతులకు లోబడి టెండర్లలో పాల్గొనవలెను.

షెడ్యూలు

వ.నెం.	పని వివరము	ధరావత్తు రూ.
1.	గ్రామ పంచాయతీ ఏరియాలో పారిశుధ్య పనులు నిర్వహణకు ఆరుగురు, మంచి నీటి పంపు ఆపరేటింగ్ పనులుకు ఇద్దరు, వీధి లైట్లు నిర్వహణకు ఇద్దరు పనివారలతో నిర్వహించుటకు	రూ 5,000/-

గమనిక : (1) పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పం.వి.), విశాఖపట్నం వారి అనుమతికి లోబడి, ఖరారు చేయుట మరియు కాంట్రాక్టు పనులకు చెల్లింపులు చేయుట జరుగును. **(2)** టెండర్లు ఎట్టి కారణము చూపి గానీ, చూపకుండా గానీ, రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారము గలదు. **(3)** పూర్తి షరతులు, యితర వివరములు కార్యాలయ పనివేళలందు పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించి తెలుసుకొనగలరు.

సం/- ఎన్.కె.సి.వి.ప్రసాద్
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం

సం/- సిరిగిడి సంతోషి
సర్పంచ్,
గ్రామపంచాయతీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం.

IN THE HON'BLE COURT OF THE V ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.28/2022 in O.S.410/2003

Between:
Sri A.Rama Mohana Rao . . . Petitioner/Plaintiff
And:
Sri Kamavarapu Satya Rao & 3 others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Kamavarapu Satya Rao,
S/o. Pedda Venkata Ratnam,
R/at D.No.49-20-1/1,
Lalitha Nagar, Visakhapatnam.
R-4:Smt. Jalamuri Sita Mahalakshmi
W/o. Late Thyagaraju,
R/at D.No.49-20-1/1, Plot No.75,
Lalitha Nagar, Visakhapatnam.

Please take notice that the above final decree petition numbered as I.A.28/2022 in O.S.410/2003 filed by the petitioner/plaintiff and the matter stands posted to **07-08-2024** for your appearance before the Hon'ble V Addl. Senior Civil Judge at Visakhapatnam. Therefore you are hereby called upon to appear either in person or through an Advocate before the Hon'ble Court on **07-08-2024** at **10:30 A.M** and in default of your appearance on that day and hour mentioned, the above I.A. will be heard ex-party in your absence and proceed further in accordance with law.

C.S. SEKHAR,
Advocate,
Flat No.205, Sarada Towers,
Ram Nagar, Visakhapatnam,
Cell:09491616888

IN THE HONOURABLE COURT OF THE I ADD'L JUNIOR CIVIL JUDGE AT ANKAPALLE
O.S.256/2021

Between:
Sri Tadi Ramesh . . . Plaintiff
And:
Sri: Guntuboyina Kanaka Durga Satya Vamsidhar & 7 others ... Defendants

SUMMON

To
Defendant Nos. 4 & 5:
1. Smt: Teketi Harshavardhini, W/o Veera Raju, Hindu, Aged about 48 years, Resident of Flat No. 5, Sterling Towers Apartment, Balayyasastry Layout, Seethammadhara North Extension, Visakhapatnam-530013.
2. Sri Kandula Rajendra Kumar, S/o Ramulu, Hindu, Aged about 60 years Resident of Door No. 15-501, Edepalli, Machilipatnam-521001, Krishna District.

Please take Notice that the above named Plaintiff filed the above suit against you and others for Permanent Injunction before the Honourbale I Additional Junior Civil Judge at Anakapalli and the same was posted to **16-07-2024** for your appearance. On that day you have to appear before the Honourable Court by **10.30 AM** either in person or through counsel, failing which a ex-parte will passed against you.

T. JEEVAN,
Advocate
Anakapalli. Visakhapatnam-530013
Dt: 08.07.24 Cell : 9866466946

నిర్వహణ లేని మరుగుదొడ్లు

తాళం వేసి ఉన్న సామాజిక మరుగుదొడ్డి

ప్రజాశక్తి -మధురవాడ : నూరు శాతం బహిరంగ మల విసర్జన లేకుండా చేయాలన్న లక్ష్యంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సామాజిక మరుగుదొడ్లను నిర్మించింది. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి నిర్వహణను సక్రమంగా చేయక పోవడంతో పలుచోట్ల మరుగుదొడ్లు నిరుపయోగమయ్యాయి. జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరాంకాలనీ, శివశక్తినగర్ రహదారిలో గాంధీనగర్ వద్ద, 6వ వార్డులో కొమ్మాది త్రిశక్తి దేవాలయం వెనుక రూ.లక్షలు వెచ్చించి మరుగుదొడ్లను నిర్మించారు. అప్పట్లో వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నిర్వహణను గాలికొదిలేసింది. ఫలితంగా నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల తలుపులు ఊడిపోగా, ఇతర సామగ్రి ధ్వంసమైంది. మరికొన్ని చోట్ల నీటి సౌకర్యం లేక తాళాలు వేసేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ మెరుగైన ర్యాంకు కోసం పరిశీలనకు వచ్చినప్పుడే అధికారులు హడావుడి చేసి చిన్నపాటి మరమ్మత్తులు చేస్తున్నారు. తర్వాత ఆ మరుగుదొడ్లకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. సరైన నిర్వహణ ఉండట్లేదు. వికలాంగులు, వృద్ధులకు కేటాయించిన మరుగుదొడ్డి నిత్యం తాళం వేసే ఉంటుంది.

వాంబే కాలనీ రహదారిలో సుద్ద గెడ్డ వద్ద ఏర్పాటు చేసిన ప్రజామరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. వాటిపై స్థానికులు ఫిర్యాదులు చేస్తే జివిఎంసి అధికారులు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టి ఏడాది కావడంతో మళ్లీ యథాస్థితికి చేరాయి. తలుపులు సక్రమంగా లేకపోవడంతో పాటు నీరు వచ్చే పైపు లైన్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

బ్యాటింగ్ చేస్తున్న ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు

ఉత్తరాంధ్ర లయన్స్ గెలుపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : వైజాగ్ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ సీజన్-3లో భాగంగా సోమవారం మధ్యాహ్నం వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ జట్లు తలపడ్డాయి. 14 పరుగుల ఆధిక్యంతో ఉత్తరాంధ్రా లయన్స్ జట్టు గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన వైజాగ్ వారియర్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగింది.ఉత్తరాంధ్రా లయన్స్ జట్టు బ్యాటింగ్ బరిలోకి దిగింది. ఉత్తరాంధ్రా లయన్స్ 6 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది.

తర్వాత బ్యాటింగ్ బరిలోకి వైజాగ్ వారియర్స్ జట్టు వచ్చింది. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసి లక్ష్యానికి 14 పరుగులు తేడాలో వైజాగ్ వారియర్స్ జట్టు ఓటమి చెందింది.

బ్రహ్మకుమారి మంజును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ తదితరులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి -తగరపువలస : యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని బ్రహ్మ కుమారి మంజు తెలిపారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యాన "ఆధునిక యుగంలో యోగా, ధ్యానం"పైసోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతికూల పరిస్థితుల్లో అందుకు అనుగుణంగా ఆలోచనా విధానాన్ని ఎలా మార్చుకోవాలి, ఎలా ఏకాగ్రత పొందవచ్చో అవగాహన కల్పించారు. యోగాను అభ్యసించడం ద్వారా మానసిక ప్రశాంతత, వ్యక్తిత్వ వికాసం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పరిశుభ్రత

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన పోతల నాయుడు తన సొంత నిధులతో గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమం పేరిట శ్మశాన వాటికను జెసిబి సహాయంతో సోమవారం శుభ్రపరిచారు. కార్యక్రమంలో భారత ఆనందం మహరాజ్ స్వామి, పెంటకోట గంగు నాయుడు, ఎం.శివ, పి.శివ, పోతల సూరిబాబు, శెరగడం అప్పారావు, మహేష్ పాల్గొన్నారు.

త్వరలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు త్వరలో యూనిఫామ్ అందిస్తామని ఎంఈఓ కే సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన క్లాత్ మండల కేంద్రానికి గుత్తేదారులు సరఫరా చేశారు. మొత్తం 2755 మంది విద్యార్థిని విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల బట్టలకు సరిపడా విడిక్లాత్ పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరికి వారు కుట్టించుకోవచ్చన్నారు. ఒక్కో జతకు 40 రూపాయల కుట్టు కూలి ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం పంచాయితీ రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలను సర్పంచ్ పడాల వెంకటరమణ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె నరసింహ, వార్డ్ మెంబర్లు గొర్లి సూకరాజు, నాయకులు కె వెంకట్, పోతల శ్రీనివాస్, బి శ్రీనివాస్, పడాల అప్పలరాజు, పంచాయితీ సెక్రెటరీ. బి సుబ్బలక్ష్మి , అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ హరీష్ అప్పారావు పాల్గొన్నారు.

15న మండల సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎండిఒ బి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు శాఖా పరమైన వివరాలతో హజరు కావాలని పేర్కొన్నారు.

9 అర్జీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి 9 అర్జీలు అందాయని జోనల్ కమిషనర్ కె.కనకమహా లక్ష్మి తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 7 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ తెలిపారు.

గీతంలో అరకు కాఫీ రుచులు

ప్రజాశక్తి -మధురవాడ : అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అరకు కాఫీ రుచులు ఇకపై గీతం సందర్శించే తల్లిదండ్రులు, ప్రముఖులకు అందుబాటులోకి రానున్నాయి. గిరిజన సహకార సంస్థ మార్గదర్శకంలో అరకు కాఫీ విక్రయ కేంద్రాన్ని గీతం అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులు ఉపయోగించకుండా అల్లూరి జిల్లాలో ఆర్గానిక్ కాఫీని సాగుచేస్తున్న గిరిజనులు ఆంధ్రప్రదేశ్‌కు విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ కాఫీని జిసిసిలో ప్రమోట్ చేశామన్నారు. గీతం యూనివర్సిటీలో సైతం దీనిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న శ్రీభరత్

శ్రీదుర్గా భవన నిర్మాణ కార్మికసంఘం ఏర్పాటు

శ్రీదుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులతో ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాంతంలో తాపీ పనిచేస్తున్న కార్మికులు సిఐటియుకు అనుబంధంగా శ్రీదుర్గా భవన నిర్మాణ కార్మికసంఘాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జివిఎంసి 5వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో జెండాను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కొమ్మాది కూడలి వద్ద ఉన్న సాయి సూర్య ఫంక్షన్ హాల్‌లో సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా పోరాటాల ద్వారా సాధించుకున్న సంక్షేమ బోర్డును కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వాలు బిల్డింగ్ మెటీరియల్ ధరలను విపరీతంగా పెంచి పనులు లేకుండా చేస్తోందన్నారు. సామాన్యులు అందుకోలేని విధంగా భూములు, రిజిస్ట్రేషన్ పన్నులు పెంచి భారాలు వేస్తోందని తెలిపారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యేవని, తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు సంక్షేమ బోర్డుల్లో కార్మికుల కష్టార్జితంతో పోగేసిన సంపదను వాడేశాయని, ఈ అన్యాయంపై చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్, నాయకులు కె.శ్రీనివాసు, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.అప్పన్న, టి.రామకృష్ణ, సభ్యులుగా బి.రమణ, ఎ.రాము, జి.భాస్కరరావు, ఎన్.ఈశ్వరరావు, కె.ప్రసాద్‌బాబు, బి.పాపారావు, వి సింహాచలం, ఎస్ అనంతరావును ఎన్నుకున్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ పాత వంతెనకు సమీపంలో పరీవాహక ప్రాంతంలో సమగ్ర సర్వే జరిపి ఆక్రమణలు తొలగించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానికుడు వానపల్లి సత్య సోమవారం పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. నదీ ప్రవాహానికి వీల్లేకుండా కొందరు కప్పిన మట్టిని తొలగించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు సత్య ఒక ప్రకటనలో తెలిపారు. నదీ జలాల వృద్ధికి ఆటంకం కలిగించేలా గత 5 ఏళ్లుగా కొంతమంది మట్టి, రాళ్లతో అడ్డుకట్టవేశారని ఫిర్యాదులో ఆరోపించారు.

చెరువు ఆక్రమణలపై సర్వే జరపాలి

జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలస చెరువు ఆక్రమణలపై సమగ్ర సర్వే జరపాలని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి సోమవారం టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్ట సురేష్ ఫిర్యాదు చేశారు. చెరువు ఆక్రమణలో భాగంగా అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో కాల్వలు మూత పడ్డాయని, ఫలితంగా చెరువులోని నీరు ఎటూ వెళ్లక దుర్వాసన వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జివిఎంసి మూడో వార్డు పరిధి బర్మాకాలనీ, రెల్లివీధి, స్కావెంజర్స్ కాలనీ, తోటవీధి, కృష్ణాకాలనీ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

పశుగ్రాసంపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రెడ్డిపల్లి పశువైద్యశాల పరిధి కోరాడలోని రైతు సేవా కేంద్రంలో పశుగ్రాసం పెంపకం, వాడకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసం వాడకం, దాని వల్ల లాభాలు, పాలు అధిక ఉత్పత్తి తదితరాలపై రైతులకు విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ వివరించారు. పశుగ్రాసంలో ఏకవార్షిక, బహువార్షిక జాతుల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి పశువైద్యాధికారి ఆర్.శ్రీనివాసరావు, వెటర్నరీ అసిస్టెంటు ఎస్.సుజాత సహాయకులు పాల్గొన్నారు.

ఆనందపురం : పాడి రైతులు పశుగ్రాసాన్ని పెంచాలని ఎం.చంద్రశేఖర్ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్లంకి, శొంఠ్యాం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశు గ్రాసం పెంచడానికి ప్రభుత్వం రాయితీపై విత్తనాలను అందిస్తుందన్నారు. పాడి రైతులందరూ పశుగ్రాసాన్ని పశువులకు మేతగా అందిస్తే పాల దిగబడి అధికంగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆనందపురం పశువైద్యాధికారి పి.అనీల్ కుమార్, సహాయకులు సంతోష్, సుబ్రహ్మణ్యం, శొంఠ్యాం పశు వైద్యాధికారి డాక్టర్ కన్నయ్యనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పునరుద్ధరణ చేసిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్

వైశాఖి స్పోర్ట్స్ పార్క్ వాకింగ్ ట్రాక్ పునఃప్రారంభం

ప్రజాశక్తి-మాధవధార : పునరుద్ధరణ పనుల అనంతరం వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని నడక మార్గాన్ని పార్కు అధ్యక్షులు సనపల వరప్రసాద్ నేతృత్వంలో వైశాఖి పార్కు సలహా మండలి సభ్యులు జానపరెడ్డి పృథ్వీరాజ్, సంకు వెంకటేశ్వరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నడక మార్గం పునరుద్ధరణ పనులకు నాయకత్వం వహించిన ఉప కార్యదర్శి రఘురామ పండాను సత్కరించారు. వారికి సహకరించిన కార్యవర్గ సభ్యులు కోరాడ మురళీధర్, చింతాడ రామారావు, లంకా వెంకటసుధాకర్, మిగతా కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి పి.కనకరాజు, కార్యవర్గ సభ్యులు టి.సత్యనారాయణ రాజు, పి.శ్రీనివాసరావు, రోణంకి నాగేశ్వరావు, యడ్ల దేముడు, పి.సన్యాసిరావు, లంకా వెంకటసుధాకర్, వి.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు ఎస్ఐ వాణిశ్రీ

చెట్ల కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : ట్రాఫిక్ సిగ్నల్ వద్ద చెట్లు కొమ్మలు పెరగడంతో అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో నాలుగో పట్టణ ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు ఆధ్వర్యాన జివిఎంసి సహకారంతో శాంతిపురం జంక్షన్‌లో ఉన్న కొమ్మలను సోమవారం తొలగించారు. చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో సిగ్నల్ లైటింగ్ సరిగా కనబడక పలు ప్రమాదాలు జరుగుతుండటంతో కొమ్మలను తొలగించినట్లు చెప్పారు.

వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

జోన్-5లో 4 వినతులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ తెలిపారు. ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి ఒక్కొక్కటి, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి రెండు కలిపి మొత్తం నాలుగు వినతులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వినతులను పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇలు మత్స్యరాజు, తారా ప్రసన్న, ఎసిపి వెంకటరావు, ఆర్ఒ బాబూరావు, రాజ్యలక్ష్మి, ఎపిడి పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పైప్‌లైన్లు

కలుషితమవుతున్న తాగు నీరు

ప్రజాశక్తి -గాజువాక

గాజువాక ప్రాంతంలో ఎక్కడ చూసినా మురుగు నీటి కాల్వలలోనే మంచినీటి పైపులైన్లు దర్శనమిస్తుంటాయి. పలుచోట్ల పైపు లైన్లు లీకేజీల ద్వారా మురుగు నీరు తాగునీటిలో కలుస్తోంది. దీని వల్ల ప్రజలు పలు అనారోగ్యాల భారిన పడుతున్నారు.

ప్రస్తుతం గాజువాక జోనల్ కార్యాలయం 20 వార్డులు పరిధిలో విస్తరించి ఉంది. మున్సిపాలిటీగా ఏర్పడినప్పుడు గాజువాక జనాభా 50 వేలు మంది మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం గాజువాకలో మూడు లక్షల మందికి జనాభా పెరిగింది. కానీ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో వేసిన పైపులైన్లు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. గెడ్డల్లోనూ, మురుగు కాలువల్లో పైపు లైన్లు ఉండడంతో, పైపుల లీకై మురుగు నీరు కలుస్తుండటంతో కుళాయిల ద్వారా బురద నీరు వస్తోంది. నిర్వాసిత కాలనీలో ఇలాంటి అనుభవాలు తరచూ ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. సిద్దేశ్వరం, నడుపూరు, అజమాబాద్, షీలానగర్ తదితర ప్రాంతాల్లో గెడ్డల్లో పైపు లైన్లు ఉన్నాయి. ఇటీవల నగరంలోనూ, జగ్గయ్యపేటలోను డయేరియా వ్యాపించడంతో జివిఎంసి కమిషనర్ స్పందించి గెడ్డల్లో ఉన్న పైపులైన్లను తొలగించి వేరే మార్గంలో ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో గెడ్డల్లోనే పైపులైన్లు ఉన్నాయి. వ్యాధులు వచ్చినప్పుడే జివిఎంసి స్పందించడం తర్వాత వాటి జోలికి వెళ్లడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన పైప్ లైన్లు ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సిద్దేశ్వరం గెడ్డలో వాటర్ పైప్ లైన్ మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

దీనిపై స్థానికంగా ఉన్న వాటర్ సప్లై అసిస్టెంట్ ఇంజినీర్ కేదారినాథ్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా, ఇప్పటివరకు రూ.16 లక్షలతో కొన్ని ప్రాంతాల్లో పైప్ లైన్లు మార్చామని, మరో రూ.13 లక్షలకు టెండర్లు పిలిచామని, పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా సరి చేస్తామని తెలిపారు.

కళా సేవా పీఠం సేవలు అభినందనీయం

కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేసిన ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం కళా సేవా పీఠం సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. కళాపీఠం ఎనిమిదవ వార్షికోత్సవాన్ని సోమవారం గోపాలపట్నంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణబాబు హాజరై మాట్లాడారు. కళాసేవా పీఠం ఆధ్వర్యాన ఏటా ప్రతిభ ఉన్న కళాకారులను ఎంపిక చేసి అవార్డులు ప్రధానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సంస్థను అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ, 2024 కళా సేవా పీఠం పురస్కారానికి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ ప్రాంతానికి చెందిన వల్లూరి చిట్టిబాబును ఎంపికచేసినట్లు తెలిపారు. చిట్టిబాబు చెక్కలతో, సిమ్మెంటుతో, మట్టితో, రాతితో అనేక బొమ్మలు, శిల్పాలు తయారు చేస్తుంటారు. చిట్టిబాబును ఎమ్మెల్యే గణబాబు సత్కరించారు.

కళాపోషకులైన వై.రమణారావుకు గణబాబు ద్వారా అవార్డు అందజేశారు. ప్రముఖ డప్పు కళాకారుడు, దళిత నాయకుడు గంపల అప్పారావుకు, బాల కళాకారులు పోతుల అరుణ్‌దేవ్ (సినిమా, టీవీ బాల నటుడు), ఎర్ని ఈక్షిత (కూచిపూడినృత్యం), కంపర లాస్య (భరతనాట్యం)కు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళా సేవా పీఠం అధ్యక్షులు రామదాసు, గవర్నమెంట్ ఐటిఐ రిటైర్డ్ ప్రిన్సిపల్ జాకబ్ రాజ్, డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎంఎన్‌వి.శ్రీనివాస్, కె.వెంకట్, అల్లు నారాయణరావు, ధన్నాల్ గజేంద్ర, తాండ్రంగి రామారావు, కొంతం నూక రాజేశ్వరరావు రామచంద్రరావు, మిద్దె అప్పారావు, కంపర కనకరాజు గ్రంథాలయాధికారి నరసింహ, కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

10న విజయ నిఘంటు చంద్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీగోకుల్ చంద్ర, రాహుల్ చంద్ర మెమోరియల్ ట్రస్ట్, సహృదయ సాహితీ సంస్థల ఆధ్వర్యాన ఈ నెల 10వ తేదిన కళాభారతిలో విజయ నిఘంటు చంద్రికను ఆవిష్కరించనున్నట్లు విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్ తెలిపారు. తిరుపతిలోని వేదిక్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ రాణి సదాశివమూర్తి పర్యవేక్షణలో మహానిఘంటువు రూపొందిందని, నిపుణుల సహకారంతో సదాశివమూర్తి ఈ మహా నిఘంటువును పూర్తిచేశారని చెప్పారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు నిఘంటువును ఆవిష్కరిస్తారని తెలిపారు. సాహితీవేత్త డి.వి.సూర్యారావు నిఘంటు స్వరూపాన్ని పరిచయం చేశారు. 50వేలకు పైగా పదాలు ఇందులో ఉంటాయని చెప్పారు. మన భాష, సంస్కృతి పట్ల అపారమైన ప్రేమతో డాక్టర్ విజయకుమార్ ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం విశాఖకు గర్వకారణమని సహృదయ సాహితీ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు.

పాత గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి పాత గోపాలపట్నంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం పర్యటించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, నీటి సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్నాల అరుణ్, సత్తిరాజు, అనూష, శ్రీకుమార్, కనకకుమార్, అల్లం రమేష్, శేఖర్, సాధు, నరేంద్ర, వర్మ పాల్గొన్నారు.

గాజువాక జోనల్ కార్యాలయం సిబ్బందికి బీసీజీ టీకాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోనల్ కార్యాలయంలో పిహెచ్‌సి సిబ్బంది సోమవార బీసీజీ టీకాలు వేశారు. జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, అసిస్టెంట్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌తో పాటు సిబ్బందికి టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.నాగప్పరావు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన వారు, సుగర్ వ్యాధి ఉన్నవాళ్లు, పొగ తాగేవారు ఈ టీకాలు వేసుకోవాలని కోరారు. దీనివల్ల భవిష్యత్తులో టిబి వ్యాధి రాదన్నారు.

బీసీజీ టీకాలు వేసుకుంటున్న జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు

పోలీసుస్టేషన్ వాహనాలమయం

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలో నడిబొడ్డున ఉన్న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ద్విచక్రవాహనాలతో నిండిపోయింది. బయట కూడా బైక్‌లు, కార్లు, ఆటోలతో నిండిపోవడంతో రోడ్డుమీద ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం ఎక్కువగా ప్రజలు వస్తూ ఉంటారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ప్రమాద, గంజాయి పట్టివేత తదితర కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్టేషన్ బయట నిలిపి ఉంచారు. దీంతో స్టేషన్‌కు వచ్చే సిబ్బంది, ఫిర్యాదుదారులు తమతమ వాహనాలను రోడ్డు మీదే నిలిపేస్తున్నారు. రోడ్డంతా వాహనాలే పార్కింగ్‌లో ఉండటంతో ఆ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ లోపల కూడా వెహికల్స్ ఎక్కువగా ఉండడంతో స్టేషన్ ప్రాంతమంతా వాహనాలతోనే దర్శనమిస్తోంది. కొన్ని నెలలుగా నిలిచిపోవడంతో టైర్లలో దోమల వ్యాప్తి చెందుతున్నాయి. దీని వల్ల రోగాలు ప్రబలే అవకాశముంది. సంబంధిత పోలీస్ అధికారులు చొరవ చూపి సీజ్ చేసిన వాహనాలను వేరే చోటికి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై నాలుగో పట్టణ సిఐ విజయకుమార్‌ను వివరణ కోరగా ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెండు మూడు రోజుల్లో వేరే చోటకు తరలించనున్నట్లు ఆయన

పోలీసు స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన వాహనాలు

విద్యార్థిని హత్యపై నిరసనల వెల్లువ

నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి మండలం, కొప్పగొండుపాలెం గ్రామంలో శనివారం బద్ది దర్శిని 9వ తరగతి విద్యార్థినిని అత్యంత కిరాతీతంగా హత్య చేసిన సురేష్‌ను పోలీసులు తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం రాంబిల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ అత్యంత కిరాతికంగా మైనర్ బాలికను చంపిన సురేష్‌ను మూడు రోజులైనా పోలీసులు పట్టుకోకపోవడం ఆశ్చర్యం కల్గిస్తుందన్నారు. నిందితునిపై గతంలో పోక్సో కేసు ఉన్నప్పుడు 60 రోజులకే బెయిల్ ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత సురేష్ కొప్పకొండ పాలెం గ్రామంలో తిరుగుతున్నాడని, సదరు బాలిక ప్రాణాలకు ముప్పు ఉందని స్థానిక పిఎస్‌కు తెలిపినప్పటికీ పోలీసులు సీరియస్‌గా తీసుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు, ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించి నిందితుడు సురేష్‌ని పట్టుకొని, కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ, నాయకులు వై రాము, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జి దేవుడు నాయుడు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యలమంచిలి : దర్శినిని హత్య చేసిన సురేష్‌ని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఎలమంచిలిలో అంబేద్కర్ విగ్రహం విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వందన, భవాని మాట్లాడుతూ దర్శినిని హత్య చేసిన సురేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ శ్రీను, రాజేష్, కృప, మణికంఠ, రవి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సీపట్నం టౌన్ : రాంబిల్లి మండలంలో మైనర్ బాలికను హత్య చేసిన నిందితుడను కఠినంగా శిక్షించాలని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యాన విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. మానవ హారంగా ఏర్పడి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతకృష్ణ, ఐద్వా జిల్లా నాయకులు కెవి.సూర్యప్రభ మాట్లాడుతూ ఇటువంటి హత్యలు పునావృతం కాకుండా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు లగుడు గౌరి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసన్న, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, ఎస్‌ఎఫ్‌ఐ నాతవరం మండల సెక్రెటరీ రాజు, డివిజన్ సభ్యులు జనార్ధన్, భూషణ్, కిరణ్ , జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మానవహారం చేస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా నాయకులు

నిందితుడ్ని నిర్భయ చట్టం కింద శిక్షించాలి : ఐద్వా

అనకాపల్లి : రాంబిల్లి మండలం, కొప్పుగుండు పాలెం గ్రామంలో బాలికను అత్యాచారం హత్య చేసిన కసింకోట మండలానికి చెందిన జె,సురేష్‌ను నిర్భయ చట్టం కింద శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిందితుడు ఎక్కడున్నా పట్టుకొని నిర్భయ చట్టం కింద శిక్ష విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.బుజ్జి, కే. దేవి, శేషారత్నం, భాగ్య పాల్గొన్నారు.

ఫార్మా యాజమాన్యాల బరి తెగింపు

చెరువులో ఫార్మా వ్యర్థ రసాయన డ్రమ్ముల డంపింగ్
విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ రాంకీ ఫార్మసిటీలోని ఫార్మా కంపెనీలు యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ ఫార్మావ్యర్థ రసాయనాలు గుర్తు తెలియని వ్యక్తులు చేత డంపింగ్ చేయిస్తున్నాయి. పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా కిలో మీటర్ దూరంలో ఉన్న చెరువులో సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఫార్మా వ్యర్థ రసాయనాలతో కూడిన డ్రమ్ములను డంప్ చేశారు. ఆ డ్రమ్‌ల్లోని కెమికల్స్ కింద పడి పోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లింది. ఆ విష వ్యర్థ రసాయన వాయువులు పీల్చలేక స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం చెక్ పోస్ట్‌ల వద్ద సక్రమమైన చెకింగ్ లేకుండా వాహనాల పంపించడం వలన కొంతమంది తుక్కు దుకాణ యాజమాన్యాలు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు డ్రంపింగ్ చేస్తున్నారని, దీనివలన పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో రాంకీ యాజమాన్యం చెలగాటమాడుతుందన్నారు. ఇటీవలే పరవాడ - భరిణికం మొల్లేడు గడ్డలో రసాయనిక వ్యర్థ జలాలు వదలడం, ఉప్పుటేరులో చేపల మృత్యువాత పడడం వంటి చర్యలపై రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్, రెవెన్యూ మత్స్య శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

చెరువులో పడేసిన వ్యర్థ రసాయన డ్రమ్ములు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటన తప్పదు

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-మునగపాక

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటన తప్పదని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ గ్రామ రైతు సంఘం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు చేసి రైతులు సాధించుకున్న ఉచిత విద్యుత్తుకు తూట్లు పొడిసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టం 2020 అమలు చేయడం వలన రైతులకు, పేదలకు ఇచ్చే సబ్సిడీలు ఎత్తివేయబడుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా నేటి ప్రభుత్వం కూడా ఉచిత విద్యుత్తును నిర్వీర్యం చేస్తూ రైతులకు అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. నేటి మంత్రి నారా లోకేష్ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని నాడు ప్రచారంలో చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగింపు విషయంలో పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ఈనెల 15న ఎలక్ట్రికల్ డిఈ, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, గ్రామ రైతు సంఘం నాయకులు బొడ్డేటి త్రినాధరావు, సూరిశెట్టి నరసింహమూర్తి, సూరిశెట్టి అచ్చంనాయుడు, మద్దాల వెంకట్, ఆడారి గంగనాయుడు, వేగినాయుడు, టెక్కలి రమణ, ఆడారి రమణ, పెంటకోట సన్యాసినాయుడు, వేగి మహేష్, భీశెట్టి జగన్నాధ రావు, పచ్చికూరు గంగులు, పెంటకోట వెంకట తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటారుకు బిగించిన మీటర్‌ను పరిశీలిస్తున్న నేతలు

10న కోర్కెల దినంలో పాల్గొనండి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై సత్వరం చర్యలు చేపట్టాలని కోరుతూ ఈనెల 10న నిర్వహిస్తున్న కోర్కెల దినం (డిమాండ్స్ డే)లో జిల్లాలోని వివోఏలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి పిలుపునిచ్చారు. ఏపీ వెలుగు వివోఏల ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా విస్తృత స్థాయి సమావేశం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ వివోఏల సమస్యలు గత ప్రభుత్వ కాలంలో అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కులర్ రద్దు, ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్, యూనిఫామ్ వంటి సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తెలుగుదేశం నేతృత్వంలోని ప్రభుత్వం వివోఏల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని, వివోఏలపై రాజకీయ పరంగా తొలగింపులు, వేధింపులు జరక్కుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు లక్ష్మీ ప్రసన్న, రాజేష్, రమణ, మాణిక్యం, వై లక్ష్మి, అన్ని మండలాల నుంచి వివోఏలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎల్లయ్య కాలువలో పూడికతీత

ప్రజాశక్తి- అనకాపల్లి : తుమ్మపాల గ్రామం ప్రమీల నగర్‌లో ఎల్లయ్య కాలవలో ఉన్న చెత్తచెదారాలతో పూడిక పోవడం వల్ల డ్రైనేజీ నీరు ఎటూ వెళ్ళలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు చొరవ తీసుకొని జెసిబి, ట్రాక్టర్లతో పూడికను తీయించారు. ఈ సమస్య చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్నందున గ్రామసభల్లోనూ, బోర్డు మీటింగ్ లోను చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచు పెంటయ్య నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, వార్డ్ మెంబర్లు ఎన్నంశెట్టి రామారావు, తర్రా సత్యారావు, మాదిబోయిన నాగరాజు, రవ్వ భవాని శ్రీను, ప్రజలు కూడా పాల్గొన్నారు.

జివిఎంసి ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీలో ఒప్పంద కార్మికులకు ఐదు నెలలగా బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని జీవీఎంసీ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు అజయ్, వై.శివ, సంతోష్, నూకరాజు, బొమ్మల రాము డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా జీతాలు కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా కాంట్రాక్టు పీరియడ్ ముగిసిపోయినా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ రెన్యువల్ చేయలేదని, మెయిన్ కమిషనర్ కార్యాలయానికి పంపాల్సిన ఫైలు పంపకపోవడంతో జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని, కాంటాక్ట్ పీరియడ్‌ని రెన్యువల్ చేయాలని కోరారు.

అన్నమయ్య పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక శారదా బ్రిడ్జి వద్ద గల అన్నమయ్య పార్కును శీఘ్రగతిన అభివృద్ధి పరచి పట్టణ ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణకు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్ల నాగభూషణం సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

కొణతాలకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణని జనసేన పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పోరాటం చేస్తూ అనేక ఉన్నత పదవులను కొణతాల అధిరోహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ బసవ కృష్ణమూర్తి, కంఠం రెడ్డి సూర్యనారాయణ, కుమార్, కొయ్య రామకృష్ణ, వేగి శ్రీనివాస్, వాసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసి రామునాయుడుకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఈగల రామునాయుడు పెద్దకర్మ సోమవారం మారేడుపూడిలో జరిగింది. మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఇందులో పాల్గొని రామునాయుడుకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా కలెక్టర్ కె విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. 303 అర్జీలు నమోదు కాగా, వినతి పత్రాల ద్వారా అర్జీదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని, అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్‌ఓ కె.శ్రీనివాస్, కెఆర్ఆర్‌సి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వివిఎస్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ రమామణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 36 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఎస్సై దివ్య పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వినతి

అనకాపల్లి : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి చట్టాలను వికలాంగులపై ప్రయోగిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం నాయకులు పాత్రపల్లి వీరు యాదవ్ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి డి.ఎల్.డి.ఓ మంజుల వాణికి వినతిపత్రం అందచేశారు.

తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని..

సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న సుమారు 74 కుటుంబాలకు తక్షణమే తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఆ గ్రామస్తుల వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు సీరం అప్పలరాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

భూములు అప్పగించాలని...

సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామానికి చెందిన సాలాపు తాతారావు కుటుంబీకులు తమ భూమిని తమకు అప్పగించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సాలాపు మంగమ్మ, కర్రి అప్పారావు ,కర్రి హనుమంతరావు, కర్రి రామచంద్రరావు, కర్రి అర్జునరావు, కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బినామీ డ్వాక్రా గ్రూపులతో మోసగించిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

బినామీ డ్వాక్రా గ్రూపులతో ప్రజలను మోసం చేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకొని, వారిని అరెస్టు చేయాలని సిపిఎం నాయకులు గంట శ్రీరామ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ ఆఫీస్ వద్ద సోమవారం బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి మండలం డిఆర్డిఏ పరిధిలో సత్యనారాయణపురం పంచాయతీ, కొత్తూరు పంచాయతీ వివోఏలు డ్వాక్రా గ్రూప్ సభ్యులకు తెలియకుండా బినామీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి ఒక్కొక్క గ్రూపుకి రూ.15 లక్షల నుండి రూ.20 లక్షల వరకు లోన్లు మంజూరు చేయించుకొని కోట్లాది రూపాయలను కాజేశారని తెలిపారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులలో ఈ లోన్లు డ్రా చేశారని, ఈ అక్రమాలలో బ్యాంకు మేనేజరు, సిబ్బంది, డిఆర్డిఏ అధికారుల పాత్ర ఉందని పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.డి.వరలక్ష్మి బి.మాణిక్యం, బాధితులు ఉపమాక లోవలక్ష్మి, రేవతి, సుభాషిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధిత మహిళలు

రాజకీయాలకు అతీతంగా సేవలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు నిరంతరం సేవలందించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి కోన సంధ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఒకే పార్టీకి చెందిన సర్పంచులున్నప్పటికీ ఎన్నికలలో తాను విజయం సాధించానని, అందరూ కలిసి మెలిసి పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి లాలం రాంబాబు, జడ్‌పి కో ఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్, ఎంపిడిఓ సురేష్ కుమార్, తహసీల్దార్ రజనీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జెసిబిలు, లారీలు సీజ్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గంగవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 59లో జగనన్న లే-అవుట్ దగ్గర అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గొర్లి రాముకు చెందిన జేసిబిని పట్టుకొని పోలీసులకు అప్పగించామని వీఆర్వో వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు తమ సిబ్బంది మరియు మైనింగ్ రాయల్టీ అధికారి స్వాతిలు ఘటనా స్థలానికి వెళ్లి ఒక లారీ, జేసిబిలను పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసి తగు చర్యల నిమిత్తం సీజ్ చేసినట్లు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత చట్టాలను అన్ని శాఖల అధికారులు పూర్తి అవగాహన చేసుకోవాలని స్థానిక ఎంపిడివో బివిస్వేవన్ పట్నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్వైజర్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఓ వి.మంగతయ్యారు, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

పాడి రైతుకు ప్రమాద బీమా సౌకర్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు డెయిరీ మేనేజర్ కొండ్రపు శేషు తెలిపారు. పల్లపు ఆనందపురం గ్రామంలో సోమవారం హెరిటేజ్ పాడి రైతులకు ఏరువాక బోనస్ ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామారావు, సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

ఉగ్గినిపాలెంలో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని ఉగ్గిని పాలెం గ్రామంలో సోమవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వీధుల్లోని విద్యుత్ దీపాలు కాలిపోవడంతో రాత్రి సమయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యాన వీధి లైట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు 'సంస్కృతి' విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూల్‌లో జరుగు రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జి.ధార్మిక శివాన్విత, ఆర్.తేజ, టిఎస్.రణదీర్, ఎమ్.కార్తీక్, ఎల్.హిమప్రభాస్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ క్రీడాకారులను, కోచ్ జి.హరినాథ్ రెడ్డిని పాఠశాలల సీ.ఈ.ఓ కె.నిశాంత్ అభినందించారు.

శ్రీనివాసరావుకు భరత్ కుమార్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి నాయకుడు, శ్రీనూకాంబిక దేవస్థానం మాజీ డైరెక్టర్ ఆడారి శ్రీనివాసరావు తండ్రి నరసింగరావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సోమవారం శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, వైసిపి యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎంపిటిసి సభ్యులు కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ వదరం చిన్న, వార్డు మెంబర్లు రవ్వ భవాని శ్రీను, తత్ర సత్యారావు, నాగరాజు, హైస్కూల్ హెచ్ఎం శంకర్రావుపాల్గొన్నారు.

నిరుపయోగంగా సులబ్ కాంప్లెక్స్

మంచినీటి పథకం వద్ద బహిరంగ మల విసర్జన

నిరుపయోగంగా ఉన్న సులబ్ కాంప్లెక్స్ ఇదే...

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి సులబ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసినా, తగిన నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. అనకాపల్లి మండలం తుమ్మపాల వీధి అంబేద్కర్ నగర్ వద్ద ఉన్న సులబ్ కాంప్లెక్స్‌కి పంచాయితీ మూడున్నర లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. దీనికి రన్నింగ్ వాటర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే దీనిని నిర్వహణ లేక నిరుపయోగంగా ఉంది. అంబేద్కర్ నగర్‌ను ఆనుకొని 2022లో ఎంఆర్‌డిడబ్ల్యూసి నిధులు రూ.27 లక్షలతో 40 కిలో మీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేశారు. ఈ నీటిని అంబేద్కర్ నగర్, తుమ్మపాల వీధి వడ్రపేట ప్రాంతాల్లో సుమారు 150 కుటుంబాలు (1500 మంది) వినియోగిస్తున్నాయి. అయితే సులబ్ కాంప్లెక్స్ సరైన నిర్వహణ లేక ప్రారంభించిన కొద్ది నెలలకే మూతపడింది. అప్పట్నుంచి సులబ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్న మహిళలు ఓవర్ హెడ్ ట్యాంకును ఆనుకొని బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. దీనివలన పెద్ద ఎత్తున తుప్పలు డొంకలు పెరగడం మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సులబ్ కాంప్లెక్స్ చుట్టూ జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ప్రహరీ గోడ, సిమెంట్‌తో గాని టైల్స్‌తో గాని వాక్వే నిర్మాణం చేపట్టాలని, రక్షిత మంచి నీటి పథకం చుట్టూ సిమెంట్‌తో గచ్చులు, ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నవోదయకు పిఎంఎన్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-వడ్డాది : జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి జరిగిన ప్రవేశ పరీక్షల్లో వడ్డాది పిఎంఎన్ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం విడుదలైన నవోదయ రెండో జాబితాలో వడ్డాది పిఎంఎన్ స్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. దేవరపల్లి గ్రామానికి చెందిన లెక్కల భారతి, వడ్డాది గ్రామానికి చెందిన కర్రి జ్ఞానేశ్వరి, లాలం కోడూరుకి చెందిన కర్రి షణ్ముఖ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పివి రమణ తెలిపారు. మొదటి జాబితాలో పిఎంఎన్ స్కూల్ నుంచి ఐదుగురు, రెండో జాబితాలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, తోటి విద్యార్థులు స్థానిక నాయకులు అభినందించారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థులు

హైడ్రో పవర్ ప్లాంట్‌కు చేపట్టిన రహస్య సర్వేను ఆపాలి

తహశీల్దారుకు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెం వద్ద బోడ్డేరు నదిపైనా, చింతలపూడి పంచాయతీ పరిధిలో శారదానది పైనా అదాని కంపెనీకి చెందిన సంస్థ తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంట్ కోసం చేస్తున్న రహస్య సర్వేలను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర సోమవారం దేవరాపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ హైడ్రోపవర్ ప్లాంటుల నిర్మాణాలను ఈప్రాంతంలోని గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అయినా తమకు అనుమతులున్నాయని చెప్పి, గిరిజనులకు డబ్బులు ఆశ చూపించి బలవంతంగా సర్వేలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల రైవాడ, కోనాం రెండు జలాశయాల పరిధిలోని పరివాహక ప్రాంతాల్లో ఆయకట్టు వేలాది ఎకారాలకు సాగునీరు ప్రశ్నర్థకంగా కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కూడా వందలాది ఎకారాలు గిరిజన భూములు, గ్రామాలు ఖాళీ అవుతాయని తెలిపారు. ఇది పర్యావరణానికి ప్రమాదమన్నారు. కావునా సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఈ రహస్య సర్వేలను నివారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

నాగజగదీష్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గం విభిన్న ప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్‌ను సోమవారం సత్కరించారు. వికలాంగులకు రూ.6000 పింఛను పెంచినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, కూటమి నేతలకు అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం దివ్యాంగుల విభాగం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాలని నాగజగదీష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమం సంఘం నాయకులు నాధమని ఫణీంద్ర కుమార్, రాపేటి భాస్కర రావు, బుద్ధ విశ్వనాథం, వెలగా బుజ్జిపట్నాల వెంకట రమణ, జాగారపు సత్యం, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు గింజె కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి

విశాఖలో నివాళి అర్పిస్తున్న అమర్‌నాథ్, సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పలుచోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ హరి వెంకట కుమారి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రవీంద్ర బాబు, వరుదు కల్యాణి, పసుపులేటి బాలరాజు, తిప్పల నాగిరెడ్డి, కెకె.రాజు, వాసుపల్లి గణేష్ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : 29వ వార్డు జగదాంబ జంక్షన్ వద్ద పీతలవాసు, బాపు ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, కొండా రాజీవ్ గాంధీ పాల్గొన్నారు. పేదలకు చీరల పంపిణీ చేశారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి.

ఆనందపురం: మండలంలోని వేములవలస జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బంక సత్యం, మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో వార్డు పరిధి తగరపువలస జంక్షన్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు జివి.రమణ, వెంపాడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. రెండో వార్డు పై జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎస్.కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిల్ల పేటలో ఎస్.భాస్కరరెడ్డి ఆధ్వర్యాన జయంతి వేడుకలు జరిగాయి. భీమిలి పాత బస్టాండ్, పెద్ద బజారు, చిన్న బజారు, తోట వీధి ప్రాంతాల్లో వైసిపి మూడో వార్డు నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తంశెట్టి మహేష్, దౌలపల్లి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు. భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. జివిఎంసి నాల్గో వార్డులో నిర్వహించిన కార్యక్రమాల్లో దౌలపల్లి కొండబాబు తదితరుల పాల్గొన్నారు

భీమిలి మండలం టి.నగరపాలెం జంక్షన్‌లో పార్టీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్ ఆధ్వర్యాన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

మధురవాడ : ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలా గురువులు, పివిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు. 7వ వార్డు పరిధిలోని మధురవాడ మార్కెట్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన నివాళులర్పించారు.

సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కటుమూరి సతీష్, అల్లు శంకరరావు తదితరులు పాల్గొన్నారు. 46వ వార్డు పరిధి కైలాసపురం జంక్షన్ వద్ద సేనాపతి అప్పారావు ఆధ్వర్యాన వైఎస్ఆర్ చిత్రపటానికి కటుమూరి సతీష్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.చిన్నా, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల వైసిపి కార్యాలయం ప్రాంగణంలోనూ, మద్ది జంక్షన్‌లోనూ వైఎస్ఆర్ విగ్రహాలకు మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యాన పూలమాలలు వేశారు. ఎంపిపి కంటుబోతు రాంబాబు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర గిరిబాబు, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి బెహరా భాస్కరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని 11వ వార్డు ముస్తాఫాకాలనీలోని జివిఎంసి, అమ్మానాన్న ట్రస్టు ఆధ్వర్యాన నడుస్తున్న నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నిరాశ్రయుల మధ్య కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విన్నకోట రాము ఆధ్వర్యాన వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్.నాయుడు, షేక్ షఫీఉల్లా పాల్గొన్నారు.

అనకాపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు వైసిపి ఆఫీసు, చిన నాలుగు రోడ్ల జంక్షన్, పూడిమడక రోడ్డు బైపాస్ జంక్షన్ ప్రాంతాల్లో వైయస్సార్ విగ్రహాలకు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు, రొట్టెలు, పలుచోట్ల పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మండలంలోని వెంకుపాలెంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఉత్తరాంధ్ర చర్చ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బుద్ధ రాజేష్ ఆధ్వర్యంలో గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద రాజశేఖర్‌రెడ్డికి నివాళు లర్పించారు.

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో జెడ్‌పిటిసిలు కర్రి సత్యం, ఈర్లె అనురాధ, సర్పంచులు దాడి జగన్, రొంగలి వెంకట్రావు, చింతల వెంకటరమణ, బూరె బాబురావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. పిహెచ్‌సి ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమాల్లో వైసిపి నాయకులు కర్రి బాబు, కాపుశెట్టి శేషుబాబు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, చొక్కాకుల గోవింద పాల్గొన్నారు.

పరవాడ : వైసిపి మండల అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యాన సంతబయల వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు నాయకుడు చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎన్‌.పేట, తాళ్లపాలెం, కశింకోట గ్రామాల్లో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మలసాల కిషోర్, కలగ గున్నయ్య నాయడు, మలసాల కుమార్‌రాజా పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం గ్రామాల్లో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుచ్చయ్యపేటలో రోగులకు పంపిణీ చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట్ట గ్రామాల్లో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. వడ్డాది ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయం రమేష్, తమరాన వెంకటరమణ, దొండ రాంబాబు, మోటూరు చిన్నం నాయుడు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలో పలు గ్రామాల్లో వైసిపి శ్రేణులు వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చోడవరం కొత్తూరు జంక్షన్‌లో, సిటిజెన్ కాలనీ తదితర చోట్ల పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద పూలమాలలో వేసి ఘనంగా నివాళులర్పించారు. వాడ్రాపల్లిలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేదలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమాలలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి కార్యక్రమం అనకాపల్లి వుడ్‌పేట వాటర్ ట్యాంకు వద్ద ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లా కోటేశ్వరరావు రాజశేఖర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సనేడ గజ్జలు, ఎగ్గాడ భాస్కర్ రావు, ఏడువాకుల దేవుడమ్మ, దాడి పరమేశ్వరరావు, కొల్లి సత్యారావు, ఒరేలు వెంకటరమణ పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో వైయస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో ఏఎల్ పురం, నాగాపురం, కొంగసింగి, చోద్యం, గొలుగొండ, జోగుంపేట జంక్షన్, చీడిగుమ్మల, పుత్తడి గైరంపేట తదితర గ్రామాల్లో సోమవారం వైయస్సార్ జయంతి వేడుకలు ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఎంపీపీ మణికుమారి, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జీ, మండల యూత్ అధ్యక్షులు రామకష్ణ నాయుడు, ఎఎల్ పురం ఎంపీటీసీ బుల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి సందర్భంగా కేడీపేట పీహెచ్‌సీలో పలువురు రోగులకు పాలు, రొట్టెలు వైద్యాధికారి హరి ప్రవీణ్‌తో కలిసి పంపిణీ చేశారు. స్థానిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సు అందజేశారు. ఎంపీపీ మణికుమారి ఆధ్వర్యంలో కేడి పేటలో పలువురు వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

నాతవరం: మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రెసిడెంట్ లగుడు నాగేశ్వరరావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, పైల పోతురాజు, వైస్ ఎంపీపీ పైల సునీల్, కనక రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలోని వైసిపీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు .అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ వద్ద కొబ్బరి తోటలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

చీడికాడ: మండల కేంద్రంలో వైసిపి మండల కన్వీనర్ గొల్లవెల్లి రాజబాబు, గ్రామ శాఖ అధ్యక్షులు పరవాడ మహేష్‌లు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో వైయసార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక సిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, వైసీపీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వైయస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో వైయస్సార్ రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన నాయుడు, మాజీ వైస్ చైర్మన్ లు గొలుసు నరసింహమూర్తి, చింతకాయల సన్యాసిపాత్రుడు, వైసీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, నాయకులు పాల్గొన్నారు.

లీజుకు ఇచ్చిన భూమికి..

డి పట్టాల మంజూరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో పప్పు సెట్టిపాలెం రెవెన్యూలో ప్రభుత్వం రంగురాళ్ల క్వారీకి లీజికి ఇచ్చిన భూములలో నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు కొంతమందికి డి పట్టాలు మంజూరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగుదేశం నాయకులు రమణ, శ్రీనులు తహశీల్దార్ ప్రభాకర్ రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, పప్పుశెట్టిపాలెం రెవెన్యూ లో సర్వే నెంబర్ 75 లో భూమిని ప్రభుత్వం ద్వారా మైన్స్ శాఖ వారు 2009 వ సంవత్సరంలో 23 సంవత్సరాలకు రంగురాళ్ల క్వారీకి లీజుకు ఇచ్చారన్నారు. లీజు గడువు తీరకుండా వైసిపి నాయకుల ఒత్తిళ్ల కారణంగా గత ప్రభుత్వంలో రెవిన్యూ అధికారులు వైసిపి కార్యకర్తలుకు డీ పట్టాలు మంజూరు చేసారని వారు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన పట్టాలపై, వాటిని మంజూరు చేసిన అధికారులపైన విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దట్టం వెంకటరమణ, పొట్ల శ్రీనువాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిప్యూటీ డిఇఒ

నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటీ విద్యాశాఖ అధికారి పి.అప్పారావు సూచించారు. సోమవారం ఆయన మండలంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చేస్తున్న రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అదనపు తరగతులు ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధతో శిక్షణను అందజేయాలని, బడి బయట పిల్లలను గుర్తించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజన శాల పరిసరాలు పరిశీలించారు.కట్టెలతో వంట చేయరాదని గ్యాస్ ను వినియోగించాలన్నారు.

ఆలస్యంగా ఇసుక ర్యాంపు ప్రారంభం

- సాయంత్రానికి జిఒ - తొలి రోజు ముందుకురాని కొనుగోలుదారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక విధానం పాలసీ జీవో కోసం అధికారులు ఎదురుచూపు చూశారు. నూతన ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమలులోకి రానున్నదని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నక్కపల్లి ఇసుక ర్యాంపు వద్ద ఉన్న 28వేల టన్నుల ఇసుకను సరఫరా చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నూతన ఉచిత ఇసుక విధానం ప్రారంభించేందుకు నర్సీపట్నం ఆర్డిఓ జయరాం ,మైన్స్ ఏడి సుబ్బారాయుడు సోమవారం ఉదయం నక్కపల్లి చేరుకున్నారు. అయితే నూతన ఉచిత ఇసుక విధానం పాలసీ జీవో రాకపోవడంతో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో జీవో కోసం గంటల తరబడి నిరీక్షించారు. సాయంత్రం 3 గంటలకు ప్రభుత్వం నుండి జీఓ వెలువడింది. అనంతరం ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు రావడంతో సాయంత్రం 6 గంటల తర్వాత నూతన ఉచిత ఇసుక విధానం ను ఇసుక ర్యాంపు వద్ద వారు ప్రారంభించారు. మొదటి రోజు ఇసుకను కొనుగోలు చేసేందుకు లబ్ధిదారులు ఎవరు ముందుకు రాలేదు. టన్ను ఇసుక ధర రూ.1225 లు గా నిర్ణయించారు. ఉచిత ఇసుక విధానంపై లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ఇసుక ర్యాంపు వద్ద సీఐ అప్పన్న పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డిఓ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ఉచితం పేరుతో ఇసుక దోపిడీ

-మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజక వర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఉచితం పేరుతో సుమారు 5 కోట్ల ఇసుక దోపిడికి సిద్ధమవుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గబ్బాడ స్టాక్ పాయింట్‌లో సుమారుగా 70 వేల నుంచి 80వేల టన్నుల ఇసుక ఉంటే కేవలం 45వేల మాత్రమే ఉందని చెప్పి దోపిడికి సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో తక్షణమే స్పందించి దోపిడిని అడ్డుకోవాలన్నారు. ఉచిత ఇసుక విధానం అని చెప్పి రూ.1225 ధర నిర్ణయించడం సరైంది కాదన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద నిలిచిన నీరు

చినుకు పడితే జలమయం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో సోమవారం కురిసిన వర్షానికి మండల కేంద్రంలో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సీతారామరాజు నగర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి వెళ్లే రోడ్డు చినుకు రాలితే చిత్తడిగా మారుతుంది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి కూడా ఇలానే ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయా ప్రాంతాల వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలను సక్రమంగా అమలు చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: కఠినమైన క్రిమినల్ చట్టాలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం చెట్టుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని కఠిన చట్టాలు అమల్లోకి తీసుకు వచ్చినా పెద్దలకు చుట్టాలుగా మారుతున్నాయని ఆరోపించారు. చట్టాలను కఠినతరం చేస్తున్నా.. అవి అమలు చేయవలసిన పోలీసులు కేసులను తప్పుదోవ పట్టిస్తూ సామాన్యులకు చట్టాలు అందని ద్రాక్షగానే మిగులుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోవింద్, అర్జున్, శ్రీనువాసు, అప్పలనాయుడు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో దిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చీడికాడ: చెరువు ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మరణించిన సంఘటన కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచింది. ఎస్సై సూర్యనారాయణ అందించిన వివరాలు... చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన గంటల అప్పారావు (56) పశువులను మేతకు మర్రి చెరువు వైపు తోలుకు వెళ్ళాడు. మర్రిచెరువు గట్టుపై వెళ్తున్న గొర్ల రాము అప్పారావును చూసి చెరువు లోతుగా ఉందని, వెళ్లవద్దని సూచించింది. భర్త సాయంత్రం వరకు పాకకి రాకపోవడంతో అప్పారావు భార్య లక్ష్మి ఆత్రుతగా మర్రిచెరువు వద్దకు వెళ్లింది. గట్టు వద్ద అతడి చెప్పులు మాత్రమే ఉన్నాయి. అనుమానం వచ్చి తిరిగి గ్రామస్తులకు సమాచారం తెలిపింది. గ్రామస్తులు సహాయంతో చెరువులో గాలించగా చెరువు మధ్యలో ఊబులో కూరుకుపోయి అప్పారావు మరణించాడు. భార్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని డొంకాడ సచివాలయం పరిధిలోని సీతానగరంలో సోమవారం ఎలమంచిలి సబ్ యూనిట్ అధికారి నాయుడు ఆధ్వర్యంలో మలేరియా నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2022 సంవత్సరంలో ఈ గ్రామంలో పలువురు మలేరియా వ్యాధి బారిన పడ్డారు. ఈ మేరకు గ్రామంలో స్ప్రేయింగ్ చేశారు. డెంగ్యూ, డయోరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు యువి శ్రీనివాసరావు ,సిబ్బంది రమణమ్మ, రమణ ,ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుకన్య

గునుపూడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని గునుపూడి గ్రామంలో గొడిచెర్ల పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుకన్య రోగులను పరీక్షించారు. అందరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఆమె సూచించారు. వేడి ఆహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిరా దేవి, భారతి, సత్యనారాయణ, అంగన్వాడి టీచర్ ఝాన్సీ పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన జనసేన నేతలు

సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి, జనసేన పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సోమవారం తెనాలిలో కలిశారు. నియోజకవర్గపార్టీ ఇన్ చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో వీరంతా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ విషయాలను మనోహర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి

పబ్లిక్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో డిఎన్ రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. " పబ్లిక్ గ్రీవెన్స్" నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాఖల పరమైన ఫిర్యాదులను పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమణి, ఏవో సత్యనారాయణ, మండల ఇంజనీరింగ్ అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్, ఐకెపి , ఐసిడిఎస్ అధికారులు పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అతిథులతో క్రీడాకారులు

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేశవరావు మెమోరియల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం సాయత్రం విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్టేడియంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి శ్రీనివాస్, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సర్వభోమ, టోర్నమెంట్ నిర్వాహకులు మురళి పాత్రో హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ టోర్నమెంట్‌ను విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ కో-ఆర్డినేట్ చేశారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు విఎస్ఎన్.మూర్తి, అచ్యుత కుమార్, వేణుగోపాల్, కేశవరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే

ఈ టోర్నమెంట్‌లో 70 ప్లస్ పురుషుల విభాగంలో ఆనంద్‌రావు, 60 ప్లస్ పురుషుల విభాగంలో మొహమ్మద్ అబ్బాస్, 50 ప్లస్ పురుషుల విభాగంలో జివిఎస్.రామారావు, 40 ప్లస్ పురుషుల విభాగంలో టి.శ్రీకాంత్ రాజు, మహిళల విభాగంలో పి.వరలక్ష్మి, పురుషుల విభాగంలో రవి వర్మ , మహిళల విభాగంలో డి.దీక్షిత గెలుపొందారు. అదేవిధంగా అండర్ 9 బాలుర విభాగంలో అమర్ సాహు, బాలికల విభాగంలో ఎస్.శ్రియంక, అండర్ 11 బాలుర విభాగంలో ఆర్యన్ గోపాల్, బాలికల విభాగంలో వి.పూజిత, అండర్ 13 బాలుర విభాగంలో ఎంఎన్.బాలాజీ, బాలికల విభాగంలో టి.సన్విక, అండర్ 15 బాలుర విభాగంలో లికిత్ మోహన్, బాలికల విభాగంలో ఎస్‌కె.ఆరిఫా సుల్తానా, అండర్ 17 బాలుర విభాగంలో ఎస్‌కె.రాబ్బని, బాలికల విభాగంలో టి.సాహితిరాజ్ విజేతలుగా నిలిచారు.

ఇసుక ర్యాంపును పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి - నక్కపల్లి: నక్కపల్లిలో ఇసుక ర్యాంపును సోమవారం ఎంపీ సీఎం రమేష్ పరిశీలించారు. మైన్స్ ఎడి సుబ్బారాయుడుతో ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ విధి విధానాల మేరకు ఉచిత ఇసుకను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, మీగడ సత్తిబాబు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంపీ రమేష్